సారా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర ప్రభుత్వం సారా రహిత సమాజాన్ని నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకొని నవోదయం 2.0 ప్రారంభించిందని అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్స్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి. మధుసూదన్, ఎంపిడిఒ శివశంకర్, అర్బన్ సిఐ యుగంధర్ తెలిపారు. బుధవారం పీలేరు మండలం, గూడరేవుపల్లి పంచాయతీ, మద్రిమాకులపల్లి తాండా ప్రజలకు సారా దుష్పలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సారా తయారు చేయడం, విక్రయించడం నేరమని, సారా తాగడం ఆరోగ్యానికి హానికరమని తెలియజేశారు. ప్రభుత్వ ఆదేశాలను ఎవరు ఉల్లంఘించినా అలాంటి వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సారా తయారీ, సారా వ్యాపార వృత్తులకు స్వస్తివలికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, అందుకు అవసరమైన రుణాలను కూడా ప్రభుత్వం అందిస్తుందని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ, ఇతర శాఖల అధికారులు, ఎక్సైజ్, ప్రొహిబిషన్స్ సిఐ సుబ్బారెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పి4 సర్వేతో ప్రతి ఇంటికీ లబ్ధి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ ప్రణాళికలో భాగంగా ప్రతి ఇంటికి అభివృద్ధి ప్రతి జీవితానికి ప్రగతి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడలోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి 10వ తరగతి పరీక్షల నిర్వహణ, కలెక్టర్ల కాన్ఫరెన్స్, స్వచ్ఛఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర, సానుకూల ప్రజా అవగాహన, పి-4 మోడల్ సర్వే అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పిలు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ దిశా నిర్దేశం చేశారు. విసికి రాయచోటి కలెక్టరేట్ నుండి కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎస్పి విద్యాసాగర్ నాయుడు, జెసి ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొన్నారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరు పేదల అభ్యున్నతికి స్వర్ణ ఆంధ్ర విజన్ 2047 సాకారం దిశగా ప్రభుత్వ, దాతల, ప్రజల, భాగస్వామ్యంతో (పి-4) ద్వారా ఉన్నతంగా ఉన్న 10శాతం ప్రవాసులు, అధిక సంపన్న వ్యక్తుల సహకారంతో పేదరికం లేని సమాజం స్థాపించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈనెల 9 నుంచి 25 వరకు ప్రజల విలువైన అభిప్రాయాలను సేకరించడానికి క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసిందని, దీనిపై విస్తృత ప్రచారం కల్పించి సర్వేను పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఈ నెల 17 నుంచి 31 వరకు జిల్లాలో నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ముందస్తుగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. పరీక్ష నిర్వహణలో సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ నెల 24, 25వ తేదీలలో విజయవాడలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మూడవసారి నిర్వహించే కలెక్టర్ల కానా రేన్స్కు సూటిగా స్పష్టమైన నివేదికలు రూపొందించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15న మూడవ శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని సూచించారు. ఒక్కొక్క నెల ఒక్కొక్క అంశంతో ప్రభుత్వం స్వఛ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈనెల ప్లాస్టిక్ వాడకం తగ్గించే పద్ధతులపై ప్రజలలో ఉగాన కల్పించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రత, స్థిరమైన పద్ధతుల పాటింపు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, రెవెన్యూ, రీసర్వే గ్రామ సభలు తదితరాలలో సాను కూలతపై ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుండి ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తోందన్నారు. ఆయా అంశాలలో ప్రగతి సాధనకు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పిఫోర్ సర్వేకు సంబంధించిన ప్రచార పత్రాలను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. విసిలో డిఆర్ఒ మధుసూదన్ రావు పాల్గొన్నారు.

కూటమి కపట నాటకాలు ఇంకెన్నాళ్లు?

- యువత పోరు నిరసనలో వైసిపి నాయకులు

కలెక్టరేట్ వద్ద నిరసనకు ర్యాలీగా వస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - రాయచోటి

కూటమి ప్రభుత్వ కపట నాటకాలు ఇంకెన్నాళ్లు అని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, రైల్వేకోడూరు, పీలేరు మాజీ ఎమ్మెల్యేలు కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా యువత పోరు కార్యక్రమం కలెక్టరేట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడు తోందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధుల చెల్లింపులపై మీనమేషాలు లెక్కిస్తూ వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని వాపోయారు. కొన్ని త్రైమాసికాలుగా ఫీజురీయింబర్స్‌మెట్ బకాయిలు చెల్లించక పోవడంతో యాజమాన్యాలు కళాశాలల నుంచి విద్యార్థులను వెల్లగొట్టడం, పరీక్షల సమయాల్లో హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. పేదింటి తల్లిదండ్రులు ఇళ్లు, పొలాలు, పుస్తెలు తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చి ఫీజులు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. యువత కూడా కూటమి ప్రభుత్వం చేతిలో మరోసారి మోసపోయిందన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి మొత్తం 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడంలేదున్నారు. మెగా డిఎస్‌సి దగా అయిపోయిందన్నారు. సచివాలయ ఉద్యోగులను అనిశ్చితి పరిస్థితుల్లోకి నెట్టేసిందన్నారు. రూ.5వేలు కాదు రూ.10 వేలు ఇస్తామని వాలంటీర్లలో ఆశలు కల్పించి తీరా అధికారంలోకి వచ్చాక వారిని రోడ్డున పడేసిందిని పేర్కొన్నారు. ఇక నిరుద్యోగ భృతి హామీ కూడా తెలుగుదేశం పార్టీ 2014-19 పాలనలో మాదిరి గానే ఎగనామం పెట్టేసిందిన్నారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పోలీసు వారి నిబంధనల మేరకు శాంతియుతంగా, విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో కలసి కూటమి ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి చెల్లించాలని, మెగా డిఎస్‌సిని త్వరగా నిర్వహించాలని తెలిపారు. నూతన మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ఎన్నికల హామీలను అమలుచేయాలని ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఒ మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లాలోని మునిసిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్ ఎంపిపిలు, జడ్‌పి టిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర ప్రజా ప్రతి నిధులు, అనుబంధ విభాగాల జిల్లా, నియోజకవర్గాల అధ్యక్షులు, జిల్లా కమిటీ కార్యవర్గసభ్యులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఆవిర్భావం రోజు పోరు ఎందుకు? : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అవినీతి పార్టీ ఆవిర్భావం రోజు యువత పోరు ఎందుకు అని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు ప్రశ్నించారు. బుధవారం పార్లమెంటు క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నవ మాసాల పాటు కూడా కూటమి ప్రభుత్వం పరిపాలనను వైసిపి భరించలేకున్నారని ఆరోపించారు. యువతకు న్యాయం చేస్తున్నది తమ ప్రభుత్వమేనన్నారు. అందుకే ప్రతి పక్షంలో ఉన్నపుడు, అధికారంలో ఉన్నపుడు పట్టభద్రులు తమను గెలిపించారన్నారు. యువతను అడ్డం పెట్టుకొని అక్రమాల పార్టీ నాటకాలు ఆడుతోందని విమర్శించారు. జగన్నాటకాలు చూసే ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని విమర్శించారు. వైసిపి ఏ పోరు చేసినా ప్రజా మద్దతు ఉండదని, రాష్ట్రంలోని నిరుద్యోగుల భవిష్యత్తు కోసం నిత్యం తపించే నాయకుడు చంద్ర బాబు నాయుడేనని అన్నారు. యువతకు ఆదర్శంగా యువ నేత నారా లోకేష్ నిలుస్తున్నారన్నారు. యువతకు ఎవరు ఏం చేశారో ఎమ్మెల్సీ ఫలితాలే నిదర్శనమన్నారు. అవినీతి, అక్రమాలు కప్పి పుచ్చుకునేందుకే ఈ నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, నందలూరు మండల అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జులు కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- సంబేపల్లి (రాయచోటి)

దళితుల భూమిని ఆక్రమించిన వారిని కఠినంగా శిక్షించాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. సంబేపల్లి మండలానికి చెందిన చాట్ల సంపూర్ణ అనే దళిత మహిళకు మోటకట్ల గ్రామ పరిధిలోని ఖాతా నెంబర్ 830, సర్వే నెంబర్ 1011-5లో 0.37 సెంట్లు, సర్వే నెంబర్ 1012-3లో 4 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. భూమిలో ఎఆర్ఇజిఎస్ ప్రభుత్వ పథకం సహాయంతో మామిడి మామిడి తోట వేసిందని, ఆ తోటలో అంతర పంటగా వేరుశనగ, కంది, ఉలవ పంటలను పండించుకుంటూ జీవనం సాగిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ఈ దళిత మహిళ మామిడి తోటకు సమీపంలో ఉన్న అగ్రకులానికి చెందిన వ్యక్తికి కొంత భూమి ఉందని, ఏదో విధంగా దళిత మహిళను భయభ్రాంతులకు గురిచేసి మామిడి తోటను తన పొలంలో కలిపేసుకోవాలనే దురాహంకారంతో రెవెన్యూ రికార్డుల పరంగా ఎటువంటి ఆధారాలు లేకపోయినా ఆక్రమణకు యత్నించారని తెలిపారు. దళిత మహిళకు సంబంధించిన తోటలో తన అనుచరులతో కంచె వేసి, అక్రమంగా ఆక్రమించి దళిత మహిళను కులం పేరుతో దూషించాడని వాపోయారు. పైగా చెట్లను అతికిరాతకంగా నరికేసి, ఈ భూమి తనదంటూ బెదిరించడని పేర్కొన్నారు. నిస్సహాయురాయులైన ఆ దళిత మహిళ భయభ్రాంతులకు గురి అయ్యి, తన భర్త చాట్ల వీరయ్య సహాయంతో స్థానిక సంబేపల్లి తహశీల్దార్‌కు, ఎస్ఐకి ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయాలని కోరిందన్నారు. అధికారులు ఎవరూ స్పందించకపోగా ఆ దళిత మహిళనే అవమానకర రీతిలో మాట్లాడి ఆమెను మనో వేదనకు గురి చేశారన్నారు. తక్షణం ఆక్రమణకు గురైన దళిత మహిళ భూమిని తిరిగి ఆమెకు చెందేటట్లు చేసి, మామిడి చెట్లు నరికిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, నష్టపరిహారం ఇప్పించవలసినదిగా అధికారులను కోరారు.

సర్వే వంద శాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గాలివీడు

పాత సర్వే వంద శాతం పూర్తి చేయాలని ఎంపిడిఒ సి.ఎ.జవహర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ సభ భవనంలో సచివాలయ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు సర్వేలో భాగస్వామ్యం అయ్యేలా చూడాల్సిన బాధత సచివాలయ సెక్రటరీపై ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆధార్‌కార్డు అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సరోజమ్మ, ఆంజనేయులు నాయక్, సచివాలయ సెక్రటరీ సుకుమార్ కాలేబు, శివ నాయక్ పలువురు పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు సన్నద్ధం

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు మండలంలోని విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. మండలం నుంచి 520 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో వీరు పరీక్షలు రాయనున్నారు. బాలుర ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు గాను చీఫ్ సూపరింటెండెంట్‌గా సుబ్బరాయుడు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా మనోహర్, బాలికల ఉన్నత పాఠశాలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా దుర్గేశ్వర్ రాజు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా రామాంజనేయులు, ఉర్దూ ఉన్నత పాఠశాలకు చీఫ్‌గా చిన్న రెడ్డప్ప, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా జాపరుద్దీన్ బాధ్యతలు తీసుకున్నట్లు ఎంఇఒ చక్రేనాయక్ పేర్కొన్నారు.

సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలి : ఎస్పి

ప్రజాశక్తి - రాయచోటి

శిక్షకులకు ప్రసంసా పత్రం అందజేస్తున్న ఎస్పి విద్యాసాగర్ నాయుడు

విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలని, అందుకు బాల భటుల ఉద్యమం(స్కౌట్స్‌అండ్‌గైడ్స్) తోడ్పడుతుందని ఎస్పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. గాలివీడు రోడ్డు మార్గాన ఉన్న అర్చన కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహిస్తున్న పెట్రోల్ లీడర్ శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం ఆయన సందర్శించారు. గార్డ్ ఆఫ్ హానర్‌తో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు బంగారు భవిష్యత్తు సమకూరుతుందన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదిగేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థులకు నైతిక విలువలు, మానవతా విలువలు పెంపొందుతాయన్నారు. విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులతో, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్లకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం అర్చన కళాశాల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 250 మంది విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో 5 రోజులు పాటు ఇస్తున్న శిక్షణకు అవసరమైన అన్ని వసతులను, భోజన సదుపాయాన్ని కల్పించామన్నారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి, ఎఎస్ఒసి లక్ష్మీకర్, హెచ్ డబ్ల్యు బి నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు మార్లఓబుల్‌రెడ్డి, నాగరాజ, గైడ్ కెప్టెన్లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి : డిఇ

సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డిఇ రమణ

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని పీలేరు హౌసింగ్ డిఇ రమణ, ఎంపిడిఒ శివ శంకర్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులతో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు రూ.1,80,000లకు అదనంగా ఎస్‌సి, బిసి రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ. 75 వేలు ఆర్థిక సాయాన్ని అందిస్తోదన్నారు. ఈ సాయానికి మార్చి నుంచి ఏప్రిల్ చివరి వరకు మాత్రమే గడువు ఉందని, లబ్ధిదారులకు ఇది చివరి, మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకొని తమ ఇళ్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణానికి అదనంగా మరో రూ.12 వేలు ఇవ్వనున్నామని చెప్పారు. ఈ అవకాశం 2024 డిసెంబర్ 10 తర్వాత ఇంటి నిర్మాణాలను ప్రారంభించుకున్న వారికి మాత్రమే ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ సహాయకులు, కార్యదర్శులు ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పనిని బట్టి జియో టాకింగ్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పిఒ అశోక్ రెడ్డి, మండల పరిధి లోని అన్ని సచివాలయాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులు హాజరయ్యారు.

ఎపి, కర్నాటక సరిహద్దులో

రెండు ప్రయివేటు బస్సులు ఢీ

ఒకరు మృతి - 40 మందికి గాయాలు - ఆస్పత్రికి తరలింపు

ఎదురెదురుగా ఢీకొన్న ప్రయివేటు బస్సులు

ఆస్పత్రిలో చికిత్స పొంతుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక రాయల్పాడు వద్ద మండలంలో రెండు ప్రయివేటు బస్సులు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో 40 మంది గాయపడ్డారు. సువర్ణముఖి ట్రావెల్స్ బస్సు కండక్టర్ గంగాధర అలియాస్ బాబు (35) మృతి చెందాడు. ప్రమాదానికి సంబంధించి రాయల్పాడు ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఎఆర్ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేట్ బస్సు బెంగళూరు నుంచి నంద్యాలకు బయల్దేరింది. సువర్ణముఖి ట్రావెల్స్ బస్సు కడప నుంచి బెంగళూరుకు వెళ్తోంది. ఈ రెండు బస్సులు మదనపల్లి సమీపంలోని రాయల్పాడు మండలం గెలజకూరు వద్ద బుధవారం తెల్లవారుజామున ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సువర్ణముఖి ట్రావెల్స్ కండక్టర్ గంగాధర్ మృతి చెందగా, రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న 40 మంది వరకు ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన బాధితులను కోలారు, శ్రీనివాసపురం, మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రాయల్పాడు పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనాల్లో వివిధ ఆసుపత్రులకు తరలింపు చేసి, మృతి చెందిన కండక్టర్ గంగాధర్ మృతదేహాన్ని శ్రీనివాసపురానికు తరలించారు. ప్రమాదానికి సంబంధించి రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మృతి చెందిన గంగాధర్

చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

యాప్ గురించి రైతులకు వివరిస్తున్న జెడిఎ చంద్రనాయక్

కందులు విక్రయించాలంటే యాప్‌లో నమోదు చేయాలి : జెడిఎ

ప్రజాశక్తి- రామాపురం

కంది పంట పండించిన రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలంటే కంది పంట ఇ-క్రాప్ చేయించుకున్న రైతులు రైతు సేవ కేంద్రంలో తప్పనిసరిగా సిఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తూ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మార్కెట్ యార్డ్‌లోని కందులు కొనుగోలు కేంద్రంలో కందులు క్వింటాలు ధర రూ.7,550 కనీసం మద్దతు ధర ఇస్తారని రైతులకుతెలియజేశారు. ఇకపై పిఎం కిసాన్ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయించుకోవాలన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ అనుబంధ శాఖల నుంచి లభించే పథకాలకు అర్హులని చెప్పారు. వేరుశనగలో జింక్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు, పంటల బీమా వల్ల ప్రయోజనాలు వివరించారు. రబీ సీజన్‌లో పంటల నమోదు చేయించుకున్న వారిపై అభ్యంతరాలుంటే ఈ నెల 19 లోపు రైతు సేవ కేంద్రంలో సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కలిగించారు. సమావేశంలో ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి వై.నాగమణ, ఎఇఒ ప్రపంజిని, విహెచ్ఎ యాసిన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఐక్యతను ఎవరూ దెబ్బ తీయలేరు : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటిలో శ్రీ వీరభద్ర స్వామి పారువేట ఉత్సవ సందర్భంగా ర్యాలీని హిందూ సోదరులు ఎంతో ఐక్యంగా నిర్వహించారని, కొంతమంది అల్లరి మూకలు ఆ ర్యాలీలో చేరి విద్వేషపూరితమైన వ్యాఖ్యలు చేసి రాయచోటి ప్రశాంత వాతావరణాన్ని కలుషితం చేశారని టిడిపి జిల్లా మైనార్టీ కార్యదర్శి అతావుల్ల పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి ఆనవాయితీగా ఉత్సవ ర్యాలీ శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో అందరి సమక్షంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. రాయచోటిలో ఈనెల 4న కొంతమంది ఉద్దేశపూర్వకంగా అల్లర్లు సృష్టించారని పేర్కొన్నారు. ఇది మన హిందూ ముస్లిం సోదరుల ఐక్యతకు భంగం కలిగేటట్లు చేయడం చాలా బాధాకరం. ఎల్లప్పుడూ హిందు ముస్లిం సోదరులు ప్రతి పండగ కలిసి మెలిసి చేసుకోవడం ఒకరిని ఒకరు శుభాకాంక్షలు తెలుపుకోవడం రాయచోటిలో ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ అన్నారు. ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను గౌరవించుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

నిర్ణీత సమయంలో పశుగణన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-రామాపురం

నిర్ణీత సమయంలో పశుగణన పూర్తి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై అన్నారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిలో బుధవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కగా పశుగణనను నిర్ణీత సమయంలో పూర్తిచేసి జిల్లాను ఆదర్శంగా నిలవాలని అన్నారు. అనంతరం నల్లగుట్టపల్లి పంచాయతీ రాచపల్లిలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని 268 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు 4 నుండి 8 నెలల వయసు ఉన్న 16 దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు, 21 పశువులకు గర్భకోశ పరీక్షలు104 పశువులకు సాధారణ చికిత్సలు 242 పశువులకు బ్యాటాక్స్ పిచికారి చేయించారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు మాలకొండయ్య, లక్కిరెడ్డిపల్లి సహాయ సంచాలకులు సురేంద్రనాథ్ బెనర్జీ, మండల పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశుగణను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్

నియామక పత్రాలు అందజేస్తున్న పంతగాని నరసింహ ప్రసాద్

జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ వారి సహకారంతో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది పంతగాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలతో పాటు పలు ప్రయివేట్ కంపెనీలలో ఉద్యోగాలను ఏర్పాటు చేస్తున్నామని వీటి ద్వారా మరింత అభివృద్ధి చెందవచ్చున్నారు. దాదాపు 6 కంపెనీలకు చెందిన ప్రయివేటు ఉద్యోగాలను నిరుద్యోగులకు ఏర్పాటు చేసి ఉద్యోగులుగా మార్చాలని దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఎంపిడిఒ సిహెచ్.నాగార్జున మాట్లాడుతూ పంతగాని ఏర్పాటు చేసిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని నిరుద్యోగులు ఉద్యోగులుగా మారాలని పేర్కొన్నారు. పంతగాని నిర్ణయం తీసుకోవడం మంచి పరిణామమని ప్రశంసించారు. కార్యక్రమంలో నరేష్ బాబు, జ్ఞానశేఖర్‌రెడ్డి, పోతురాజు నవీన్, నార్జాల హేమ రాజ్, సూర్య ప్రకాష్ నాయుడు, కస్తూరి దినేష్ నాయుడు, శివ పాల్గొన్నారు.

19న వారపుసంత వేలంపాట

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లి గ్రామ పంచాయతీకి చెందిన బస్టాండ్ గేటు, వారపు సంత గేటు, పంచాయతీ షాపింగ్ రూములకు ఈ నెల19వ తేదీ బుధవారం బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీలోని వారపుసంత గేటు, బస్టాండ్ గేటు, పంచాయతీ షాపింగ్ రూములకు ఉదయం 11 గంటలకు, వారపు సంత ఆవరణంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, సర్పంచ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటను నిర్వహిస్తున్నామన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు బస్టాండ్ గేటుకు రూ.70 వేలు, వారపు సంత గేటుకు రూ.2 లక్షలు, ఒక్కొక్క పంచాయతీ షాపింగ్ రూములకు రూ.20 వేల నుంచి రూ.40 వేలు ముందుగా డిపాజిట్‌గా చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. పంచాయతీకి బకాయిలు ఉన్నవారు వేలంలో పాల్గొనుటకు అనర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరింత సమాచారానికి 7013954635 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

నేడు మామిడి రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-కలికిరి

మామిడి రైతులకు స్థానిక కెవికెలో గురువారం ఉదయం 10 గంటలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పీలేరు, వాల్మీకిపురం ఉద్యాన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ కలికిరి, వాల్మీకిపురం మండల మామిడి రైతులకి పూత, పిందే దశలో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు, మామిడి కాయలకి కవర్ల (ఫ్రూట్ కవర్లు) వాడకంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మామిడి రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకోవాల్సిందిగా కోరారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పట్టణ పరిధిలోని రామ్‌నగర్, నూనెవారిపల్లె, తదితర ప్రాంతాల్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, బ్రూ సెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను రాజంపేట డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయ భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం వేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రావు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతలను పాడి రైతులకు వివరించారు. పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ మాట్లాడుతూ బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలను 4 నెలల నుంచి 8 నెలల పెయ్య దూడలు, ఆవులు లేదా గేదెలలో వేసుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో దాదాపు 146 గాలికుంటు వ్యాధి టీకాలను, 28 బ్రూసెల్లోసిస్ టీకాలను వేశామని చెప్పారు. కార్యక్రమంలో అత్తిరాల పశువైద్యాధికారి డాక్టర్ కె.భాగ్యవతి, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-పీలేరు

ఎమ్మెల్యే నల్లారి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి చిత్రపటానికి పీలేరు గ్రామ పంచాయతీ కార్మికులు పాలాభిషేకం చేశారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం సమావేశం మందిరంలో పంచాయతీ ఇఒ గురుమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో దుర్భర జీవనం సాగిస్తూ, ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడే పంచాయతీ కార్మికుల సమస్యలు గుర్తించి, వారికి వేతనాలు పెంచి ఆదుకోవాలని పీలేరు ఎమ్మెల్యే అసెంబ్లీలో తన వాణిని వినిపించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు నల్లారి అభిమానులు, పంచాయతీ కార్మికులు పాల్గొని ఎమ్మెల్యే చిత్రపతానికి ఘనంగా పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో 27 వేల మంది పంచాయతీ కార్మికులు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక పడుతున్న కష్టాలు, వారి సాధక బాధలు దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీలో వచ్చిన అవకాశాన్ని పంచాయతీ కార్మికుల పక్షపాతిగా, వారి పక్షాన నిలబడి పీలేరు ఎమ్మెల్యే ప్రస్తావించడం ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లడం సంతోషంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. పంచాయతీ ఇఒ వై.గురుమోహన్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ సైతం పారిశుధ్య కార్మికుల పక్షాన నిలబడ్డారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సంఘం కార్యదర్శి పురం రామ్మూర్తి, ఆర్‌టిసి ఎన్ఎంయు పీలేరు డిపో గౌరవ అధ్యక్షులు యల్లెల రెడ్డెప్పరెడ్డి, ప్రముఖ టిడిపి నాయకులు పోలిశెట్టి సురేంద్ర, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి స్పోర్ట్స్ మల్లి, మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లారి రియాజ్, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణా రెడ్డి, రమణారెడ్డి, ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ధనాసి వెంకటరామయ్య, కార్మిక నాయకులు పులి రెడ్డప్ప, ఓబులేస్, చిట్టెమ్మ, రాణెమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసం అందరి బాధ్యత

పీలేరు : కిశోర బాలికల వికాసం అవగాహన ర్యాలీలో ఐసిడిఎస్ ఉద్యోగులు

ప్రజాశక్తి-పీలేరు

సమాజంలో కిశోర బాలికల వికాసానికి కృషి చేయడం మనందరి బాధ్యతని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ రాజమ్మ తెలిపారు. మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సిడిపిఒ, సూపర్వైజర్ల సంయుక్త ఆధ్వర్యంలో పీలేరులోని కెవి.పల్లి ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు 2కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ రాజమ్మ మాట్లాడుతూ కిశోర వికాసానికి లింగ వివక్ష అడ్డుకాకూడదని, వారి ఆత్మ రక్షణ, ఆర్థిక స్వాలంబనకు నైపుణ్యంతో పాటు ఉపాధి అవకాశాలు తప్పనిసరని అభిప్రాయపడ్డారు. సమాజంలో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహవలు వంటి దురాచారాలను అరికట్టడంతో పాటు లైంగిక వేధింపుల నుంచి వారికి రక్షణ కల్పించడంలో ప్రజల సహకరం చాలా అవసరమని పేర్కొన్నారు. ఆడబిడ్డలకు నాణ్యమైన విద్య, సంపూర్ణ ఆహారం అందించడం కూడా మన బాధ్యతాన్ని చెప్పారు. బాలికల ఆరోగ్యం కోసం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని తెలియజేస్తూ వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆడబిడ్డలను చదవనిద్దాం, వారిని బతకనిద్దాం అంటూ నినాదాలు చేస్తూ ప్రజల చైతన్యం కోసం ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పీలేరు ప్రాజెక్టు పరిధిలోని అన్ని మండలాల అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షకులు స్వరూప, భారతి, శంకరమ్మ, శాంతి, స్వర్ణ, అన్నపూర్ణ, ఉమ, యశోదరాణి, అక్కయ్య, గురుకుల విద్యాలయం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లంపేట : ఆడపిల్లలను చదివించి రక్షించి వారి జీవితానికి బంగారు బాట వేద్దామని ఐసిడిఎస్ సూపర్వైజర్లు మణెమ్మ,నిర్మలమ్మ అన్నారు. ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు, లింగ వివక్షత వద్దు అని మండల అభివృద్ధి కార్యాలయం నుండి పుల్లంపేట పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్ల వివాహ వయసు 18 సంవత్సరాల తర్వాతే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వనజ కుమారి, సరోజనమ్మ, నాగ లత, చెంచులక్ష్మి పాల్గొన్నారు.

నిమ్మనపల్లె : సమాజంలో బాలికల పాత్ర, భద్రత, సమానత్వం, సాధికారత అత్యంత కీలకమని మదనపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ సుజాత అన్నారు. బుధవారం ముష్టూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలోని విద్యార్థులతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి 2కె రన్ మార్థాన్ నిర్వ హించారు. సిడిపిఒ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల భద్రత, హక్కులు, సమానత్వం, సాధికారతపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, కెజిబివి పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీపై రైతులకు వ్యవసాయ పరికరాలు : ఎడిఎ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వం వ్యవసాయ పరికరాలను, యంత్రాలను 50 శాతం రాయితీతో రైతులకు అందిస్తున్నాదని, అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని మదనపల్లె వ్యవసాయ శాఖ ఎడిఎ శివ శంకర్ తెలిపారు. బుధవారం కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లెలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, రైతు సేవా కేంద్రం సిబ్బందితో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులను సాధించడానికి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు తప్పక పాటించాలని అన్నారు. పంట సాగు విధానం, క్రిమి సంహారక మందుల వాడకం, పంట దిగుబడి, మార్కెటింగ్‌లో మెలకువలు పై అధికారులు ఎప్పటికప్పుడు తగు సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంట అధిక దిగుబడులకు తగినంత మోతాదులో మాత్రమే ఎరువులను ఉపయోగించాలని సూచించారు. పలు వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ, రైతులను ఆదుకోవడానికి, వ్యవసాయంలో ఖర్చులను తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాదని పేర్కొన్నారు. అందులో భాగంగానే వ్యవసాయ పరికరాలు, యంత్రాలపై 50 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను రైతులకు అందిస్తున్నాదని వివరించారు. అవసరమైన రైతులు వెంటనే రైతు సేవా కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఖరారు చేసిన మార్గదర్శకాల మేరకు రాయితీ యూనిట్లు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది శ్రీకాంత్, రాజశేఖర్, కుమార్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఇంటిపన్ను మినహాయించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ సైనికులకు ఇంటి పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట మదనపల్లె మాజీ సైనిక సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో మాజీ సైనికులు ధర్నా నిర్వహించారు. మాజీ సైనికులకు ఇంటి పన్ను మినహాయింపుతో పాటు మంచి నీటి కొళాయి పన్ను 20 శాతం మినహాయింపు ఇవ్వాలని మునిసిపల్ మేనేజరుతో చర్చించారు. ఇంటి పన్ను కట్టమని నోటీసు వచ్చిన మాజీ సైనికులు తమ వద్ద ఉన్న ఇంటి పన్ను మినహాయింపు లెటరుని జత చేసి మున్సిపాలిటీ కార్యాలయంలో అందజేస్తే వారికి ఇంటి పన్ను నోటీసు క్యాన్సిల్ చేయబడుతుందని, ఇంటి పన్ను కట్టనవసరం లేదని మేనేజర్ స్పష్టం చేశారు. ఇంజినీరింగ్ విభాగాలలో పనిచేసి రిటైర్డ్ అయిన వారికి కుళాయి పన్నులో కూడా 20 శాతం రాయితీ ఉన్నట్లుగా జీవో ఉన్నదని, అయితే మున్సిపల్ సిబ్బంది 100 శాతం నీటి పన్ను కట్టించుకుంటున్నారని తెలిపారు. 20శాతం మినహాయింపు ను పరిశీలించాలని కోరారు. మాజీ సైనికులకు ఎవరికైనా ఇంటి పన్ను కట్టమని నోటీసులు వచ్చుంటే వారు వెంటనే మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడి ఇంటి పన్ను మినహాయింపు పొందగలరని కంచర్ల శ్రీనివాసులు నాయుడు సూచించారు. ధర్నాలో పాల్గొన్న మాజీ సైనికులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

పన్ను మినహాయింపు కోరుతూ ధర్నా చేస్తున్న మాజీ సైనికులు

మామిడిలో తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

మామిడి రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

ప్రజాశక్తి-పీలేరు

మామిడి పంట తెగుళ్ల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం పీలేరు మండలం, కాకులారంపల్లి పంచాయతీ, కోళ్ల ఫారం గ్రామం, బాలంవారిపల్లి పంచాయతీ, నాలేవాండ్లపల్లిలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకి మామిడి తోటల్లో పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత వాతవరణ పరిస్థితుల్లో నాకు నాకు తేనె మంచు పురుగు, తామర పురుగులు, ఆంత్రాక్నోస్ తెగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. వీటి నివారణకు బుప్రోఫుజిన్ 20 శాతంంఅసిపేట్ 50 శాతంఎ 1గ్రాము లేదా పైమెట్రోజన్ 0.6గ్రాములు ం సాఫ్ 2 గ్రాములు లేదా థయోఫినైట్ మిథైల్ 1 గ్రాంలీటర్ నీటికి కలిపి పిచికారి చెయ్యాలని తెలిపారు. పిందెలు రాలుతున్నట్లు అనిపిస్తే ప్లానోఫిక్స్ అనే మందును 4.5 లీటర్ల నీటికి 1 మిల్లీని పైన తెలిపిన మందులతో కలిపి స్ప్రే చేయాలన్నారు. మామిడి రైతులందరూ ఫ్రూట్ కవర్లు కట్టుకోవాలని తెలియజేయజేశారు.

ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల ఉపయోగాలు: కాయలు నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు ఫ్రూట్ కవర్లు కట్టడం వల్ల పండు ఈగ, మసిమంగు నుంచి కాయకు రక్షణ ఉంటుందని చెప్పారు. ఫ్రూట్ కవర్స్ కట్టిన కాయలన్నీ నాణ్యతతో ఒకే సైజులో ఉంటాయని తెలిపారు. దూర ప్రాంతాలకు రవాణా చేసినప్పుడు కాయలు తొందరగా పాడు కావని పేర్కొన్నారు. ఎలాంటి రసాయన అవశేషాలు ఉండవని తెలిపారు. వీటికి మంచి ధర కూడా లభిస్తుందని పేర్కొన్నారు. అధిక గాలి వచ్చినప్పుడు కాయ నేల రాలకుండా కాపాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఉద్యాన శాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ రమాదేవి, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్ కేసు పరిష్కారానికి చొరవ చూపండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఆటోనగర్ కోర్టు కేసు పరిష్కారానికి చొరవ చూపండంటూ బుధవారం ఎపిఐఐసి ఎండి అభిషిత్ కిషోర్‌ను మంగళగిరి కార్యాలయంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా కలిశారు. కోర్టులో కేసు వేసిన రైతు రమణయ్యతో కలిసి ఆటోనగర్ కేసు విషయమై చర్చించి దారి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండి ఆఫీసు ఒఎస్‌డిని త్వరలోనే కోర్టు కేసు విషయమై పరిశీలన చేసి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆటోనగర్‌కు సంబంధించిన దారి సమస్య గత 15 ఏళ్లుగా కోర్టులో పెండింగ్‌లో ఉండటంతో ఇంతకాలం ఆటోనగర్ అభివృద్ధి పనులు జరగకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే తెలిపారు. అభిషేక్ కిషోర్‌ను కలిసిన వారిలో సీతక యుగంధర్, గురుమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా? : 'నాదేండ్ల'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఐదేళ్లలో గుర్తుకు రాని విద్యార్థులు ఇప్పుడు గుర్తుకు వచ్చారా అంటూ తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు నాదెండ్ల అరుణ్ తేజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంటు, వసతి దీవెన జగన్‌కు ప్రతిపక్షంలో ఉండగా గుర్తొచ్చిందా అని ఎద్దేవా చేశారు. గతంలో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్‌నే విద్యా దీవెనగా మార్చి తామేదో కొత్తగా ఈ పథకాన్ని సృష్టించినట్లు జగన్ ప్రచారం చేసుకున్నాడన్నారు. 2014-19 టిడిపి ప్రభుత్వంలో విద్యార్థుల తరపున పూర్తి ఫీజులు నేరుగా కళాశాల యాజమాన్యాలకే ప్రభుత్వం అందజేసిందన్నారు. కానీ జగన్ రెడ్డి మాత్రం ప్రచార్భాటంతో విద్యా దీవెన, వసతి దీవెన అంటూ విద్యార్థుల్ని, వారి తల్లితండ్రుల్ని మోసం చేసి, జిఒ నెంబర్ 77 తీసుకొచ్చారన్నారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసి, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పడిపోవడానికి వైసిపినే కారణమన్నారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి లో పాలు పంచుకోవాలని హితవు పలికారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలకడ

మండలంలో తాగునీటి సమస్యల తలెత్తకుండా చూసేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ అబ్దుల్ రహీం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముడియంవారిపల్లి పంచాయతీలో తాగునీటి పరిష్కారానికి నూతనంగా వేయబడిన బోర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. ఈ బోర్ నుండి గ్రామానికి పైప్ లైన్ ఏర్పాటు చేసి వీలైనంత తొందరలో త్రాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. పైపులైను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామములో త్రాగునీటి సమస్య పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించినట్లు తెలిపారు. ఉపాధి పనులను నాణ్యతతో చేయించాలని వీరికి అదనంగా 50 రోజులు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో కల్పించిన విషయం గుర్తుంచుకొని ఉపాధి పనులు చేసుకుని దాని ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఈ వేసవి కాలంలో ఉపాధి పొందాలని సూచించినట్లు తెలిపారు. అనంతరం ముడియంవారిపల్లి సచివాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు సచివాలయం సిబ్బంది సమయాపాలనతో వ్యవహరించి విధులకు హాజరుకావాలని, వారి హాజరు రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలోపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ భరత్ సింహా, సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు

వైసిపి బలోపేతానికి కృషి : నిస్సార్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విలువలు, విశ్వసనీయతకు ప్రతీక వైసిపి అని మదనపల్లె సమన్వయ కర్త నిస్సార్ అహమ్మద్ తెలిపారు. బుధవారం వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నిరంతరం ప్రజలతోనే మమేకమై ప్రజల కోసం పనిచేస్తూనే ఉందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజామాట్లాడుతూ నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు జగన్ అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ ఎస్.ఏ కరీముల్లా, జడ్పిటిసి ఉదయ్ కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ జింకా వెంకటా చలపతి, వి.ఎస్ రెడ్డి, చంద్రమౌళి, గువ్వల నాగరాజురెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్ నాయక్, జన్నే రాజేంద్ర నాయుడు, బాలగంగాధర్ రెడ్డి, మాధవరెడ్డి, 3వ వార్డు నూర్, చిప్పిలి మల్లికార్జున రెడ్డి, మహేష్ బాబు, హబీబ్, చరణ్, శారద, మేరీ పెద్దఎత్తున వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కలకడ

ఈ నెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన కలకడలో కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పనికి తగిన ఫలితం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి హరిప్రసాద్, అమరావతి, ఎలక్ట్రీషియన్ జిలానిబాష, వెంకటరమణ, శ్యామలమ్మ, వెంకటరమణ, వెంకటేశ్వరమ్మ, రామచంద్ర, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వేలంపాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

వేలంపాటలో రూ.21.96 లక్షలు ఆదాయం

ప్రజాశక్తి-కలికిరి

పంచాయతీ ఆధ్వర్యంలో జరిగిన వేలంపాట పోటాపోటీగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈవో అశోక్ ఆధ్వర్యంలో జరిగిన వేలంపాట కార్యక్రమానికి డిఎల్‌పిఒ నాగరాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారపు సంతకు నిర్వహించిన వేలం పాటలో రూ.16.03 లక్షలకు అశోక్ కుమార్‌రెడ్డికి దక్కించుకున్నారు. ప్రయివేట్ బస్టాండ్ రూ.2.03 లక్షలకు ఇస్మాయిల్ బాష, దినసరి కూరగాయల మార్కెట్ రూ.మూడు లక్షలకు అల్లావుద్దీన్, జంతు వధశాల రూ.90 వేలకు ఎంఎల్ రాజా దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో కలికిరి పంచాయతీకి 21,96,000 ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిరాజ్ ఉద్దీన్, సర్పంచ్ ఆర్.ఎల్లయ్య, యోగేష్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు చిన్నారులు, వృద్ధులకు అల్పాహారం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అల్పాహారం వితరణ చేస్తున్న శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

మదనపల్లి మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువు మిట్టలోని వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో పిఎస్ఆర్ గ్రూప్స్ చైర్మన్ పిసి శివ శంకర్‌రెడ్డి తండ్రి పిసి జయ చంద్రారెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా బుధవారం అల్పాహారం ఏర్పాటు చేశారు. పిఎస్ఆర్ భార్య సుమిత్రమ్మ, కుమారుడు పిసి శివ శంకర్‌రెడ్డి, కోడలు పిసి లక్ష్మి ప్రసన్న, మనుమడు పిసి లిఖిత్ వెలుగు ప్రత్యేక పాఠశాలలోని దివ్యాంగులు, వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివ శంకర్‌రెడ్డికి వారి కుటుంబ సభ్యులకు ప్రిన్సిపల్ లీనాకుమారి కృతజ్ఞతలు తెలియచేసి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమాలలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, సోషల్ వర్కర్ ఎం.గీత, వార్డెన్ ఎం.స్వీటీ, సిబ్బంది, దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

మృతి చెందిన కొండయ్య

తిరుమలకు పాద యాత్రగా వెళుతున్న భక్తుడు కొండయ్యను బుధవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. వైఎస్ఆర్ జిల్లా వీరపనాయనిపల్లె మండలం అనుంపల్లి పంచాయతీకి చెందిన కొండయ్య తిరుమలకు వెళ్లేందుకు తమ స్వగ్రామం నుండి కాలినడకన బయలుదేరాడు. మం డలంలోని రెడ్డిపల్లి చెరువు కట్ట మీద నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహ నం ఢీకొనడంతో కొండయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కొండయ్య మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహనకుమార్ గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి మండలం, ఓదివీడు సమీపంలో ఆటో, నీళ్ల ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురు కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. సిబ్యాల గ్రామం, తురకపల్లెకు చెందిన ఐదుగురు కూలీలు ఆటోలో బుధవారం ఉదయం 8 గంటల సమీపంలో టమోటా పండ్లు కోసేందుకు బయలుదేరారు. నూజివీడులో సమీపంలోకి రాగానే నీళ్ల ట్యాంకర్ ఢీకొట్టింది. ప్రమాదంలో ముగ్గురు కూలీలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గాయపడిన వారిని వెంటనే ప్రభుత్వానికి తరలించి వారికి మెరుగైన వైద్యం అందించాలని స్థానిక నాయకులకు తెలిపారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గం టిడిపి నాయకులు మౌర్యరెడ్డి స్పందించి గాయపడిన వారిలో ఇద్దరిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఒకరిని కడప రిమ్స్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.